
కృష్ణకాలనీలో కొలువుదీరిన దుర్గామాత


మహదేవపూర్ : అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

# కొలువుదీరిన అమ్మవారు

- ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కృష్ణకాలనీ, అక్టోబర్ 15 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు కొలువుదీరారు. జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి దుర్గామాతను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. రెడ్డికాలనీలోని సాధన స్కూల్ మైదానంలో, కృష్ణకాలనీలోని అంబేద్కర్ క్రీడా మైదానం ఎదురుగా, కారల్ మార్క్స్ కాలనీ శివాలయం ఆవరణలో, రాజీవ్ నగర్‌కాలనీలోని వినాయక మండపంలో, జవహర్ నగర్ కాలనీలోని పోచమ్మమైదానంలో, సుభాష్ కాలనీలోని స్కాట్స్ అండ్ గైడ్స్ మైదానంలో, పైలట్, జయశంకర్ కాలనీల్లో, జంగేడు, వేశాలపల్లి ఆలయాల్లో దుర్గామాతలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**మహదేవపూర్‌లో..**

మహదేవపూర్ : మండల కేంద్రంలో గర్భగౌరీ ఆలయ ఆవరణలో, దుబ్బగూడెంలో దేవీ శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు కొలువుదీరారు. భక్తి శ్రద్ధలతో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు మంగళహారతులతో వచ్చి అమ్మవారికి పూల మాలలు వేసి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు మోటం వెంకటేశ్వర్లు, నరసింహస్వామి, భక్తులు పాల్గొన్నారు.


గణపురం : పూజలు చేస్తున్న కేటీపీపీ సీఈ సిద్దయ్య దంపతులు

**కేటీపీపీలో..**

గణపురం : మండలంలోని చెల్పూరు కేటీపీపీలో సీఈ సిద్దయ్య దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీపీపీలో దుర్గామాతను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ కేటీపీపీలో 2 వేల మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారని, వారి కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దుర్గాదేవి ఆలయ కమిటీ సభ్యులు, కేటీపీపీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

కాళేశ్వరం : పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కాళేశ్వరంలోని శుభానంద(పార్వతీ)దేవి, శ్రీమహాసరస్వతి అమ్మవారి ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య దుర్గాదేవి మాతను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేపట్టారు. మొదటి రోజున దుర్గాదేవి శైలపుత్రిగా దర్శనమివ్వడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజించగా అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో మహేశ్, చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్ రావు, ధర్మకర్తలు అడప సమ్మయ్య, రాంరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, దేవేందర్, పద్మ, ఎంపీటీసీ మమత, సర్పంచ్ వసంత తదితరులు పాల్గొన్నారు. కాగా, కాళేశ్వరానికి చెందిన రామగుండుం శుభనంద–రామ్మూర్తి శర్మ దంపతులు అమ్మవారి ఆలయానికి రూ. 3 లక్షల విలువైన వెండి ముఖ కవచం, ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు బహూకరించారు. అలాగే ఈదులపల్లి శాంత శ్రీ మహాసరస్వతి అమ్మవారి ఆలయ ధ్వజ స్తంభానికి రూ. 1.80 లక్షల విలువైన ఇత్తడి తొడుగును అందజేశారు.


శైలపుత్రి అలంకరణలో అమ్మవారు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

టేకుమట్ల (చిట్యాల), అక్టోబర్ 15 : హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ లో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో చిట్యాల మండలం జూకల్ ప్రభుత్వ పాఠశాల 8వ తరగతి విద్యార్థులు ఐశ్వర్య, మేఘన ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గిరగాని కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఐశ్వర్య, మేఘనతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబరాజును ఉపాధ్యాయులు అశోక్, తిరుపతితో పాటు సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఎంపీటీసీ జంబుల తిరుపతి, గుండెకారి రమేశ్, ఆనంద్‌రెడ్డి తదితరులు అభినందించారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న డీపీవో ఆశాలత

## కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 15 : భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు చందుపట్ల భద్రయ్య మృతి చెందగా ఆదివారం వారి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం తక్షణ ఆర్థిక సాయంగా రూ.10 వేలు కొంపెల్లి గ్రామపంచాయతీ నుంచి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో డీపీవో ఆశాలత, ఎంపీవో నాగరాజు, పంచాయతీ సెక్రటరీ స్వప్న, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజవీరు, సర్పంచ్ కాసగాని కవితా దేవేందర్, ఉప సర్పంచ్, కారోబార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 15 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం నుంచి తెలంగాణ సార్వత్రిక ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్, భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి అభ్యర్థుల కోసం పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరుకావాలని డీఈవో సూచించారు.

## విద్యుదాఘాతంతో తాత్కాలిక ఉద్యోగికి గాయాలు

గణపురం, అక్టోబర్ 15 : విద్యుదాఘాతంతో విద్యుత్ శాఖ తాత్కాలిక ఉద్యోగికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మండలంలోని అప్పయ్యపల్లి పరిధి మోరంచవాగు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం విద్యుత్ శాఖ తాత్కాలిక ఉద్యోగి జనగాని కిరణ్ స్తంభంపై మరమ్మతు చేసేందుకు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం వెల్తుర్లపల్లి సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకున్నాడు. అనంతరం స్తంభం ఎక్కగానే షాక్‌కు గురై కిందపడడంతో తల, నడుముకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి తన వాహనంలో హుటాహుటిన మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. సబ్ స్టేషన్ ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని రైతులు తెలిపారు. నిరంతరం సిబ్బందితో సమన్వయం చేసుకోవాల్సిన ఆపరేటర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగి ప్రాణాపాయం నుంచి బయటపడిన సందర్భాలున్నాయని వారు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి

## బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

- ప్రజామోదయోగ్యమైన మేనిఫెస్టో
- సీఎం కేసీఆర్ నిర్ణయం చరిత్రాత్మకం
- ఓటుతో కృతజ్ఞతలు తెలుపుదాం
- భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి

కాటారం, అక్టోబర్ 15 : రాష్ట్రంలోని సబ్బండవర్గాలకు మేలు కలిగేలా, సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజామోదయోగ్యంగా ఉందని, యావత్తు దేశం దీనిని స్వాగతిస్తున్నదని భూపాలపల్లి జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో నూటికి నూరు శాతం ప్రజల భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో మంథని నియోజక వర్గ ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి పుట్ట మధును గెలిపించి సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే రాష్ట్ర ప్రజలకు గొప్ప భవిష్యత్ ఉంటుందన్నారు. కేవలం రైతులకో, మరే వర్గానికో కాకుండా యావత్ ప్రజలు లబ్ధిపొందేలా, రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడేలా మేనిఫెస్టోను తీర్చిదిద్దారన్నారు. 93 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా రైతు బీమా తరహాలో రూపొందించిన బీమా చరిత్రాత్మకమన్నారు. ప్రజలందరికీ ఆయన ఆత్మబంధువని మరోసారి నిరూపించారన్నారు. గత ఎన్నికల ముందు మేనిఫెస్టోలో లేని ఎన్నో పథకాలను అమలు చేశారని, దళిత బంధు, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు ఎన్నో కుటుంబాల దశ, దిశను మారుస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మంథని ఎమ్మెల్యేగా మళ్లీ పుట్ట మధుకు ఓటు వేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ మేనిఫెస్టోలోని అంశాలను గడప గడపకూ చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, బీఆర్‌ఎస్ యూత్ మండలాధ్యక్షుడు రామిల్ల కిరణ్, బీఆర్‌ఎస్ పలిమెల మండలాధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, ఎస్సీ సెల్ నియోజక వర్గ ఇన్‌చార్జి పంతకాని సడవలి, నాయకులు రాజేంద్రాచారి, బొడ్డు రాజబాబు, వెంకటస్వామి, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


డీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 15 : టీఎస్‌ఆర్‌టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు భూపాలపల్లి డిపో మేనేజర్ లక్ష్మీనారాయణను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను డిపో మేనేజర్‌కు వివరించి వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వరంగల్ రీజినల్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, రీజినల్ సెక్రటరీ తోట శ్రీనివాస్, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టు స్వామి, రీజినల్ మెంబర్ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చెల్పూరు ఎస్సీ మాల అభివృద్ధి కమిటీ ఎన్నిక


ఎస్సీ మాల అభివృద్ధి కమిటీ సభ్యులు

గణపురం, అక్టోబర్ 15 : మండలంలోని చెల్పూరు గ్రామ ఎస్సీ మాల అభివృద్ధి కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పైడిమల్ల దేవేందర్, చెన్నూరి మధుకర్, సంఘ సభ్యులుగా శంకర్, కిరణ్, శివకుమార్, రమేశ్, శంకర్, సంపత్, రాజయ్య, సుధాకర్, సారయ్య, నవీన్, తిరుపతి, రాజేందర్, సుమన్, కుమార్, భద్రయ్య ఎన్నికయ్యారు.